# టిటిడి ఆలయ నిర్మాణానికి అడుగులు



వివరాలు మెయిన్‌లో...


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి




# క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల :** యువత మైదానాల్లో క్రీడలతో రాణించాలని మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం అందిస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆది వారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాజన్న సిరిసిల్ల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్17 బాలి కల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు, సెలక్షన్ ప్రక్రియకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగు ణంగా గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోం దని తెలిపారు. ఇటీవల వేములవాడలో రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించడంతోపాటు సిరిసిల్ల కేంద్రంగా వివిధ క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమ న్నారు. తాజాగా బాలికల అండర్17 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిం చడం శుభపరిణామమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ యువత క్రికెట్‌తో పాటు కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడల పట్ల ఆసక్తి చూపడం సంతోష కరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం సీఎం కప్ ద్వారా గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. గతంలో జిల్లాలో నిర్వహించిన క్రీడా జ్యోతి కార్యక్రమం ద్వారా సుమారు 42 క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిన విషయాన్ని గుర్తు చేశారు. క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహ కులు, క్రీడా సంఘాల ప్రతినిధులు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లోనూ జిల్లాలో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహించి యువతలో క్రీడల పట్ల ఆస క్తిని పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు, ఆకునూరి బాలరాజు, నాయకులు చొప్పదండి ప్రకాశ్, గొప్ప దేవయ్య, ప్రభాకర్, చంద్రకళ, బొద్దుల శ్రీని వాస్, టీం కోచ్‌లో తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో కనకదుర్గమ్మ ఆగమన వేడుకలు

### మంగళహారతులు.. డప్పు చప్పుళ్లు..
### ఒగ్గు కళాకారుల నృత్యాలతో మార్మోగిన ధరూర్

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో కనకదుర్గా సేవ సమితి ఆధ్వర్యంలో అమ్మవారి ఆగమన వేడుకలు భక్తిశ్రద్ధలతో,అంగరంగ వైభవంగా నిర్వ హించారు.అమ్మవారికి స్వాగతం పలికేందుకు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తిపా రవశ్యంలో పాల్గొన్నారు. గ్రామ వీధులన్నీ అమ్మవారి నామస్మరణతో మార్మోగగా, పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా మంగళహారతులు పట్టుకొని అమ్మవారికి ఘన స్వాగతం పలికారు. డప్పు చప్పుళ్లు,ఒగ్గు కళాకారుల ఉత్సాహభరిత నృత్యాలు, భక్తుల జైజైకారాల నడుమ అమ్మవారి ఊరేగింపు కొనసాగింది. యువత, మహిళలు, పెద్దలు,చిన్నారులు అనే తేడా లేకుండా గ్రామ ప్రజలందరూ ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగింపుగా తీసుకువస్తుండగా, దారిపొడవునా భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు.మహిళల మంగ ళహారతులు, కళాకారుల నృత్యాలు, భక్తుల కోలాహలంతో ధరూర్ గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. సంప్రదాయ కళారూపాలకు ప్రాధాన్యతనిస్తూ ఒగ్గు కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం అమ్మవారిని ఊరేగింపుగా కనకదుర్గా సేవ సమితి మండపానికి తీసుకువచ్చారు. అక్కడ అమ్మవారిని ప్రతిష్ఠించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి రాకతో గ్రామంలో పండుగ శోభ సంతరించుకుందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. కనకదుర్గా సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు గ్రామ ప్రజల్లో భక్తిభావాన్ని, ఐకమత్యాన్ని చాటిచెప్పాయి.గ్రామ ప్రజలందరూ కలిసి అమ్మవారి ఆగమన వేడుకల్లో పాల్గొనడం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించింది.అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలంద రిపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

## క్రీడాస్ఫూర్తిని చాటిన కోరుట్ల..
# అట్యా పట్యా పోటీలు ప్రారంభం



### 19 జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు

**ప్రజాపక్షం/కోరుట్ల :** క్రీడలతోనే విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక వికాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్ష ణాలు పెంపొందుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనిచ్చినప్పుడే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలరని తెలిపారు.ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని స్థానిక మినీ స్టేడి యంలో రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల,మహిళల అట్యా పట్యా క్రీడా పోటీలు అంగరంగ వైభవంగా ప్రారంభమ య్యాయి. తెలంగాణ రాష్ట్రంలోని 19 జిల్లాల నుంచి క్రీడా కారులు ఈ పోటీల్లో పాల్గొనడం విశేషం. క్రీడాకారుల ఉత్సాహం,నిర్వాహకుల ఏర్పాట్లు, సంప్రదాయ కళారూ పాల ప్రదర్శనతో స్టేడియం క్రీడా సందడిని సంతరించు కుంది. విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడలే పునాది : విద్యార్థుల జీవితంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయి. పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలితోపాటు ఆత్మవిశ్వాసం, పట్టుదల, సమయపాలన, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చు. గెలుపోటములను సమానంగా స్వీకరించడం, ప్రత్యర్థులను గౌరవించడం, నియమ నిబం ధనలను పాటించడం వంటి విలు వలు క్రీడల ద్వారా అలవడ తాయి.ముఖ్యంగా అట్యా పట్యా వంటి భారతీయ సంప్రదాయ క్రీడలు విద్యార్థుల్లో వేగం, చురుకుదనం, ఏకాగ్రత, శరీర సమన్వయం, వ్యూహా త్మక ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొం దించడానికి దోహదపడతాయి. తక్కువ ఖర్చుతో, అందుబా టులో ఉన్న మైదానాల్లో ఆడగలిగే ఈ క్రీడలపై విద్యార్థు లకు అవగాహన కల్పిస్తే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురా వచ్చు. సంప్రదాయ క్రీడలకు ప్రోత్సాహం అవసరం : ఆధునిక సాంకేతికత, మొబైల్ ఫోన్లు, డిజిటల్ వినోదం



పెరుగుతున్న నేప థ్యంలో విద్యార్థులు బహిరంగ ఆటలకు దూరమవుతున్న పరిస్థి తులు కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఆసక్తిని పెంచడంతోపాటు సంప్ర దాయపరిచయం చేయడానికి ఉపయోగపడుతుంది. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభిస్తుంది. ప్రతి భకు తగిన గుర్తింపు లభిస్తే జాతీయస్థాయిలోనూ రాణిం చేందుకు మార్గం సుగమమవుతుంది.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ అట్యా పట్యా అసోసియేషన్ కార్యదర్శి ముఖేష్, జగిత్యాల జిల్లా అట్యా పట్యా అసోసి యేషన్ అధ్యక్షుడు డాక్టర్ వాసం నవీన్ కుమార్, కార్యదర్శి కొక్కుల రాజేష్, కోరుట్ల మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగాధర్, కోరుట్ల స్పోర్ట్స్ క్లబ్ గౌరవ సలహాదా రులు గంగాధర్ లక్ష్మీ నారాయణ, ఆల్‌రౌండర్ గంగాధర్, గౌరవ అధ్యక్షుడు ఎం.ఏ. బారి, అధ్యక్షుడు గిన్నెల విద్యా సాగర్, కార్యదర్శి జక్కుల నవీన్, పేట కార్యదర్శి అశోక్, కోరుట్ల మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ జిల్లాల కార్యదర్శులు, కోరుట్ల పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.

# వైభవంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం





**ప్రజాపక్షం /మల్లాపూర్ :** దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన మండపాల్లో దేవి అమ్మవారు ఘనంగా కొలువుదీరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని నవదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో భరతమాత కూడలి వద్ద, కనకదుర్గ సేవ సమితి ఆధ్వర్యంలో దుర్గాదేవి ఆలయంలో అమ్మవార్లు అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య కొలువుదీరగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.కాగా పలువురు భక్తులు దేవి అమ్మవార్ల దీక్షను స్వీకరించగా అర్చకులు మాలాధారణ గావించారు. కాగా తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా అమ్మవారి ఉత్సవాలను జరుపుకోనుండగా వివిధ రూపాల్లో అమ్మవారు పూజలు అందుకొని దర్శనమివ్వనున్నారు.

**జగిత్యాల :** జగిత్యాల పట్టణంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీ నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి ఊరేగింపులో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మ ణ్ పాల్గొన్నారు.అదేవిధంగా కనకదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి ఊరేగింపుతో పాటు,మార్కండేయ దేవాలయంలో కొలువుదీరిన శ్రీ గాయత్రి దుర్గాదేవి అమ్మవారి ఊరేగింపులోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చిన్నారులు అమ్మవారి వివిధ రూపాల్లో అలంకరించుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమ్మవారి ఊరేగింపుల్లో భక్తులు నృత్యాలు చేస్తూ, భక్తి పాటలతో సందడి చేశారు. దీంతో జగిత్యాల పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.జగిత్యాల పట్టణంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుండగా, ఈ ఏడాది కూడా వివిధ సేవా సమితుల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఉన్నారు.

**ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆదివారం దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గామాత కొలువుదీరగా,మండల కేంద్రంలోని పాత బస్టాండ్,కొత్త బస్టాండ్ వద్ద దుర్గా కమిటీల ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలంకరణలతో మండపాలను సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక వాహనాలపై అమ్మవారిని మండపాలకు తీసుకువచ్చి పూజా కార్యక్రమాల అనంతరం ప్రతిష్ఠించారు. నవరాత్రుల తొలి రోజు బాల త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో దుర్గా ఉత్సవ కమిటీల సభ్యులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డిపేట :** మండలంలోని గొల్లపల్లి గ్రామంలో శ్రీజమదగ్ని సమేత నాగుల ఎల్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ఉత్సవాలను ఘనంగా జరిపారు.ఉదయం నుండే గణపతిపూజ పుణ్యవచనం,దీక్షాదరణ,అఖండ దీపస్థాపన,శ్రీ రేణుక ఎల్లమ్మవారికి 11 ద్రవ్యాలచే నిర్వహించబడింది.నవరాత్రి మహోత్సవాలలో మొదటి రోజు సందర్భంగా అమ్మవారు శ్రీబాల త్రిపురదేవి సుందరిగా దర్శనమిచ్చారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీక్షాదరణ తీసుకోగా పురోహితులు సంపత్‌కుమార్‌తో మాలధారణ తీసుకుని అమ్మవారి కృపకు పాత్రులై ఆశీర్వచనం పొందారు.కార్యక్రమంలో సర్పంచ్ కొండరమేష్‌గౌడ్,గౌడ సంఘంఉత్సవకమిటి సభ్యులు పాల్గొన్నారు.





## ఎంపి సంజయ్ సింగ్‌తో ఆప్ నేత సయ్యద్ హైదర్ భేటీ

### నిర్మల్‌లో పార్టీ బలోపేతానికి వ్యూహరచన



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)రాజ్యసభ సభ్యులు సంజయ్ సింగ్‌తో ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.ఈ సమావేశంలో తెలంగాణలో, ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో పార్టీ విస్తరణ, క్షేత్రస్థాయిలో ఆప్‌ను బలోపేతం చేయడం,ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయడం వంటి పలు కీలక అంశాలపై వారిద్దరూ విస్తృతంగా చర్చించారు.జిల్లాలో ఆప్ సిద్ధాంతాలను,సంక్షేమ ఎజెండాను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు రూపొందించిన కార్యాచరణను ఎంపీ సంజయ్ సింగ్‌కు సయ్యద్ హైదర్ వివరించారు.ఈ సందర్భంగా నిర్మల్ జిల్లాలో పర్యటించి, స్థానిక పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయాల్సిందిగా రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్‌ను సయ్యద్ హైదర్ ప్రత్యేకంగా ఆహ్వానించారు.ఈ భేటీతో నిర్మల్ జిల్లాలో ఆమ్ ఆద్మీ పార్టీ రాజకీయ కార్యకలాపాలు మరింత ఊపందుకోనున్నాయని ఆప్ పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## భక్తులతో పోటెత్తిన శ్రీగిరి నందిగుండం దుర్గామాత ఆలయం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని శ్రీగిరి నందిగుండం దుర్గామాత ఆలయంలో ఆదివారం ఆలయ వ్యవస్థాపకులు వెంకటాచారి ఆధ్వర్యంలో దాదాపుగా నాలుగు వేలకు పైగా భవాని భక్తులకు మాల ధారణ చేశారు.ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు కొండాజి వెంకట చారి మాట్లాడుతూ మాల సమయంలో భక్తులు పూజ విధానం గురించి భక్తులందరికీ వివరించారు, ముఖ్యంగా ఈసారి చిన్నారులు ఎక్కువ సంఖ్యలో భవాని మాల ధరించారని అన్నారు అలాగే యువత కూడా మాలధారణ చేశారని తెలిపారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రతిరోజు పుష్పార్చన రథోత్సవం తులాభారం కుంకుమార్చన వంటి కార్యక్రమాలు ఉంటాయని అలాగే ప్రతిరోజు మధ్యాహ్న హారతి అనంతరం అన్న దానం ఉంటుందని తెలిపారు ముఖ్యంగా పాదయాత్రగా వచ్చే సాముల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి సందీప్ బృందం,ముత్యం సంతోష్ గుప్త,సాధం ఆనంద్ సాయన్న,గంగా మాత భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సాగునీరు అందించాలి

### మాజీ ఎంపిపి,సర్పంచ్ అత్తే చంద్రమౌళి డిమాండ్

ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిధిలోని రైతాంగాన్ని ఆదుకునేందుకు పంట పొలాలకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలని మాజీ ఎంపీపీ,లక్కారం సర్పంచ్ అత్తే చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుండి కమాన్ పూర్ మండలంలోని గుండారం రిజర్వాయర్ నింపి,అక్కడ నుండి లిఫ్ట్ ద్వారా శుక్రవారం పేట రిజర్వాయర్‌ను సాగునీటితో నింపాలన్నారు. అనంతరం కెనాల్ కాలువల ద్వారా ముత్తారం మండల రైతులకు సాగునీరు అందించి పంటలను కాపాడాలని ఆయన కోరారు.ప్రస్తుతం మండలంలో విచ్చలవిడిగా ఉన్న విద్యుత్ కోతల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నీరందక పంట పొలాలు కండ్ల ముందే ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల పరిస్థితిని, వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తక్షణమే స్పందించి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఒకవేళ ప్రభుత్వం స్పందించి సాగునీరు విడుదల చేయని పక్షంలో,రైతులందరినీ ఏకం చేసి వారి పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అత్తే చంద్రమౌళి హెచ్చరించారు.

## ఘనంగా పాస్టర్స్ డే వేడుకలు

**ప్రజా పక్షం /ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఇమ్మానుయేలు ప్రార్థన మందిరంలో ఆదివారం పాస్టర్స్ డే వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించుకున్నారు.అనంతరం సీనియర్ పాస్టర్ బలిపీఠం దంపతులను ఘనంగా సన్మానించుకున్నారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ లు ఏలేటి చిన్నారెడ్డి,బంటు ఏలియా,బొల్లం ఇస్సాకు, గడసంద షద్రక్,సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## దిగ్విజయంగా కొనసాగుతున్న సుల్తానాబాద్ ప్రీమియర్ లీగ్



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, 6వ వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుల్తానాబాద్ ప్రీమియర్ లీగ్ (SPL) క్రికెట్ టోర్నమెంట్ దిగ్విజయంగా కొనసాగుతోంది. రెండవ రోజు మొదటి మ్యాచ్ రహీల్ కింగ్స్ లెవెల్స్ వర్సెస్ ఎలిగేడు ఎలైట్ స్టైకెర్స్ మధ్య ఉత్కంఠ పోరులోఎలిగేడు ఎలైట్ స్ట్రైకర్స్ విజయం సాధించగా రెండవ మ్యాచ్లో ఎలిగేడు ఈగల్స్ వర్సెస్ ఏఆర్ చాలెంజర్స్ మధ్య జరిగిన సమరంలో ఎలిగేడు ఈగల్స్ విజయం సాధించింది. మూడవ మ్యాచ్ లో ఐపీఎస్ టైటాన్స్ వర్సెస్ మెరుగు సూపర్ స్ట్రైకర్స్ మధ్య జరిగిన మ్యాచ్లో ఐపీఎస్ టైటాన్స్ విజయం సాధించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం క్రీడా పండుగను తలపించేలా సందడిగా మారింది. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌కు క్రీడాకారులు, ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.తొమ్మిది రోజుల షెడ్యూల్‌లో భాగంగా రెండో రోజు జరిగిన మ్యాచ్‌లలో క్రీడాకారులు అద్భుత ప్రతిభను కనబరిచారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ఆటగాళ్లు ఆకట్టుకునే ప్రదర్శన ఇవ్వడంతో ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను తలపించే స్థాయిలో మ్యాచ్‌లు కొనసాగుతుండటంతో ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ బాకం సాయికిరణ్ మాట్లాడుతూ, యువత తమ ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి వేదికలు ఎంతో అవసరమని అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా యువతకు మరిన్ని క్రీడా అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.సుల్తానాబా ద్ ప్రీమియర్ లీగ్ విజయవంతంగా కొనసాగుతుండటంతో పట్టణ ంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతిరోజూ జరిగే మ్యా చ్‌లు అభిమానులను అలరిస్తుండగా,ఫైనల్ వరకు మరింత ఉత్కంఠభరితమైన పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

# అటవీ విధ్వంసంపై అసత్య ప్రచారం

ఎఫ్ఆర్ఓ ఖాదర్ వలి

ప్రజాపక్షం/జన్నారం : పైడిపల్లి బీట్‌లో అటవీ విధ్వంసం జరుగుతోందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని జన్నారం అటవీ శాఖ రేంజ్ అధికారి ఎస్.కె. బాబా ఖాదర్ వలి స్పష్టం చేశారు. నెట్టింట ప్రచారమవుతున్న చెట్ల నరికివేత దృశ్యాలు దాదాపు ఏడాది క్రితం నాటివని ఆయన తెలిపారు. బాదంపల్లికి చెందిన రాకేష్ అనే వ్యక్తి గోదావరి నది నుంచి అక్రమ ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలని ఇటీవల తనను కోరగా నిరాకరించినట్లు ఎఫ్ఆర్ఓ పేర్కొన్నారు. దీనిపై సమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలు చెప్పాలని ఒత్తిడి చేసినా ఒప్పుకోకపోవడంతోనే పైడిపల్లి పరిధిలో అటవీ విధ్వంసం జరుగుతోందంటూ దుష్ప్రచారం చేస్తున్నారని వివరించారు. అటవీ శాఖ సామగ్రి మాయమైన ఘటనపై ఇప్పటికే కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అటవీ రిజర్వు ప్రాంతంలోకి చొరబడిన రాకేష్‌పై కేసు నమోదుకు ఆధారాలు సేకరిస్తున్నట్లు ఎఫ్ఆర్ఓ వెల్లడించారు.

# ఐజేయు జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికైన వంశీకృష్ణకు సన్మానం



ప్రజాపక్షం/ మంచిర్యాల టౌన్: టియుడబ్ల్యూజె జిల్లా కోశాధికారిగా బాధ్యతలు నిర్వహించిన వంశీకృష్ణ ఇటీవల ఐజేయు జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికయ్యారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన టియుడబ్ల్యూజె జిల్లా సమావేశంలో వంశీకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ ప్రకాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు దేగ సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ చౌదరి, చిలువేరు నర్సయ్య, రవి రాజా, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

# గుంట్లపేట్ చౌరస్తాలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ : గుంట్లపేట్ బస్టాండ్ ప్రధాన చౌరస్తా వద్ద వాహనాల అతివేగానికి కళ్లెం వేసేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. పెంచికల్‌పేట్ నుంచి కాగజ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాలు వేగంగా దూసుకెళ్తుండటంతో ప్రమాదాల నివారణకు సర్పంచ్ దుర్గం పోషన్న ఈ చర్యలు చేపట్టారు. నాలుగు వైపుల నుంచి నిత్యం విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగించే ఈ కూడలి వద్ద ప్రమాదాలను నివారించి, ప్రజల భద్రతను కాపాడటమే తమ లక్ష్యమని సర్పంచ్ తెలిపారు. వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దాసరి కైలాసం, ఎండి అతిక్, కాసి మొండి, గజన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంఎస్‌సి ఫారంలో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



ప్రజాపక్షం/ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని ఎంఎస్సీ ఫారం గ్రామంలో బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ. పది లక్షల సిఆర్ఆర్ నిధులతో ఆదివారం సిసి రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ నోముల జయశ్రీ శ్రీనివాస్ గౌడ్ ఆదివారం కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కి గ్రామ ప్రజల తరఫున, గ్రామ అభివృద్ధి కమిటీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. అలాగే రోడ్డు మంజూరుకు కృషి చేసిన ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్లా రామ్ మోహన్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బషీర్, విడిసి గ్రామ అధ్యక్షుడు సందీప్ గౌడ్, వార్డు సభ్యులు గోపి కుమార్, యూసుఫ్ ఖాన్, అజీమ్, ప్రొతిమా, ఉస్మాన్, రవి కుమార్ గౌడ్, గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రేపు ఎడపల్లి రైతు వేదికలో సిఎం వీడియో కాన్ఫరెన్స్

ప్రజాపక్షం/ఎడపల్లి: ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాబోయే యాసంగి పంటల సాగు ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించేందుకు, వారి సందేహాలను నివృత్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ఉదయం పది గంటలకు ఎడపల్లి రైతు వేదిక నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి చర్చా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పులి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి సిద్దిరామేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌నినో పరిస్థితులను తట్టుకునేందుకు యాసంగి సీజన్ లో ఎలాంటి పంటలు ఎంచుకోవాలి రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, సాగు ప్రణాళికలపై విస్తృతంగా చర్చించనున్నట్లు వారు తెలిపారు.

మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. మండలంలోని రైతులు, సర్పంచ్‌లు, సొసైటీ ఛైర్మన్లు, ప్రజాప్రతినిధులందరూ సోమవారం ఉదయం పది గంటలకల్లా ఎడపల్లి రైతు వేదికకు చేరుకొని పెద్ద సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

# ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాపక్షం/ఎడపల్లి: ఎడపల్లి మండలంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పలు గ్రామాలలో భక్తులు అమ్మవారిని బాలా త్రిపుర సుందరి దేవి రూపంలో అలంకరించి పూజలు నిర్వహించారు. జానకంపేట్ గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం 26సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవి నవరాత్రులు మరింత ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఈ తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజు ప్రత్యేక పూజ కార్యక్రమాలు, యజ్ఞాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలలో మొదటి రోజున బాలా త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎడపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గామాతకు కాలనీ వాసులు ఘనంగా దుర్గామాత ఆగమనం కార్యక్రమం నిర్వహించారు. జానకంపేట్ గ్రామానికి చెందిన ఉప్పు జైరాజ్ దంపతులు జానకంపేట్ దుర్గామాత మండపానికి రూ. 30వేల విలువ గల ఇత్తడితో తయారు చేయించిన అభిషేక పీఠాన్ని విరాళంగా అందచేశారు.



# సిఇఆర్ క్లబ్‌లో 14న 'ఫ్యామిలీ డే'

ప్రజాపక్షం/మందమర్రి : సింగరేణి మందమర్రి ఏరియా సిఈఆర్ క్లబ్‌లో ఈ నెల 14న 'ఫ్యామిలీ డే – ఆట పాట' వినోదాత్మక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏరియా డిజిఎం సిహెచ్. అశోక్ తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉల్లాసంగా గడిపేందుకు యాజమాన్యం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ వేడుకలు జరగనున్నాయి. ఏరియా జిఎం ఎన్. రాధాకృష్ణ, సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు ఎన్. శ్రీవాణి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ ఆటల పోటీలు, గ్రూప్ డ్యాన్స్ పోటీలు ఏర్పాటు చేయనున్నారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఉత్తమ బతుకమ్మలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేయనున్నారు. నిత్యం విధి నిర్వహణలో అలసిపోయే కార్మికుల్లో మానసిక ఉల్లాసాన్ని నింపేందుకు ఈ వేడుకలు దోహదపడతాయని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిజిఎం కోరారు.



# కాంగ్రెస్ పథకాలు దేశానికే ఆదర్శం: షేక్ రషీద్

ప్రజాపక్షం/జైనూర్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని జైనూర్ మండల పార్టీ అధ్యక్షుడు షేక్ రషీద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య పాలనలో గత ప్రభుత్వాలు చేయని రీతిలో, నేడు దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రం వైపు అందరూ చూసేలా చేసిందన్నారు. పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజలు మళ్లీ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సుద్దాల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పెందూర్ ప్రకాష్, మాజీ వైస్ ఎంపిపి చిర్లే లక్ష్మణ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దుర్వా సింధు, నాయకులు భుజంగ్ రావ్, షేక్ అబ్బు, దండుగుల మహేష్, సర్పంచులు రాజేందర్, నగేష్, నాయకులు సయ్యద్ వసీం, అమృత్, షాకిర్, కోటేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# అదృశ్యమైన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని ఆచూకీ లభ్యం



ప్రజాపక్షం/నేరడిగొండ: కుంటాల గిరిజన ఆశ్రమ పాఠశాల నుండి అదృశ్యమైన ఎనిమిదో తరగతి మైనర్ విద్యార్థిని ఆచూకీ లభ్యమైంది. బాలిక ఎవరికీ చెప్పకుండా తలమడుగు మండలం దోర్లి గ్రామంలోని తన మామ ఇంటికి వెళ్లినట్లు అధికారులు తెలిపారు. బాలిక మామ అందించిన సమాచారంతో పోలీసులు, పాఠశాల సిబ్బంది రాత్రి అక్కడికి చేరుకుని విద్యార్థినిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థిని క్షేమంగా ఉండటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# నేడు రైతు వేదికల్లో సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ప్రసారం

ప్రజాపక్షం/నేరడిగొండ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నేడు మధ్యాహ్నం 12:30 గంటలకు నిర్వహించే 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్‌ను అన్ని రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు మండల ఏఓ కృష్ణవేణి తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితులపై సీఎం రైతులతో ముఖాముఖీ మాట్లాడనున్నారన్నారు. మండల రైతులు, ప్రజాప్రతినిధులు, పాక్స్, ఎఫ్‌పిఓల బాధ్యులు రైతు వేదికలకు హాజరుకావాలని కోరారు.

# నిరుపేద కుటుంబానికి మానాల ట్రస్ట్

50సిమెంట్ బస్తాలు



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : మండలంలోని ఉప్లూర్ గ్రామ నిరుపేద కుటుంబానికి చెందిన తోడేటి శాంత ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి మానాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం 50 సిమెంట్ బస్తాలు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు శాంత వారి కుటుంబ సభ్యులు మాజీ డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోనగిరి భాస్కర్, నాయకులు తీపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి, నరేష్, విజయ్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రవి, సదానంద్, శ్రీనివాస్, శేఖర్, గంగారెడ్డి, క్రాంతి, రాజేశ్వర్, శ్రీనివాస్, ముఖీమ్ పాల్గొన్నారు.

# మైనర్ బాలిక అశ్లీల వీడియో పోస్ట్ చేసిన వ్యక్తిపై కేసు

ప్రజాపక్షం/జన్నారం : మైనర్ బాలికకు సంబంధించిన లైంగిక అశ్లీల వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వ్యక్తిపై జన్నారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తన మొబైల్‌లో మైనర్ బాలిక అశ్లీల వీడియోను వీక్షించడమే కాకుండా, తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. ఈ విషయాన్ని జాతీయ నేర గణాంకాల విభాగం (ఎన్‌సిఆర్‌బి) సైబర్ టిప్‌లైన్ ద్వారా గుర్తించి జన్నారం పోలీసులకు సమాచారం అందించింది. ఈ మేరకు సైబర్ వారియర్ కానిస్టేబుల్ ఎల్. సంతోష్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై లక్సెట్టిపేట సీఐ డి. రమణమూర్తి దర్యాప్తు చేపట్టారు. మైనర్లకు సంబంధించిన అశ్లీల వీడియోలు చూడటం, నిల్వ చేయడం లేదా సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేస్తూ, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రాజీవ్ యువ వికాసం రుణాలు,ప్రభుత్వ స్పష్టమైన ప్రకటన చేయాలి

### బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న హామీలు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ ఆరోపించారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం జూన్ 2న రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుపేద యువతకు రుణాలు అందిస్తామన్న మాట నీటిమూటలగిపోయిందని,మళ్లీ ఇప్పుడు వచ్చే నవంబర్ 19న ఇస్తామని ప్రభుత్వం ప్రకటిస్తోందని తెలిపారు.రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ తక్షణమే రుణాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే,బీసీ మహిళలకు ప్రభుత్వం ఇస్తామన్న కుట్టుమిషన్ల దరఖాస్తు ప్రక్రియ పూర్తయినప్పటికీ, వాటిని ఎప్పుడు పంపిణీ చేస్తారనే దానిపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. విజయదశమి లోపు బీసీ మహిళలకు కుట్టుమిషన్లు,దీపావళి లోపు నిరుపేద కుటుంబాలకు రుణాలు అందించి,ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోవాలని చంద్రశేఖర్ హితవు పలికారు.

# బోథ్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి కాంగ్రెస్ ఘన సన్మానం

**ప్రజాపక్షం/బోథ్ :** ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయులది కీలక పాత్ర,బోథ్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానం నిర్వహించారు. బోథ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దాసరి పురుషోత్తం,గౌరవ అధ్యక్షులు నమలి కొండ సంతోష్ కుమార్ లతో పాటు సభ్యులు శర్మ,షేక్ అలీ,ఈర్ల ఎర్రన్న లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు భోజన్న, ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, అచ్యుత్ నంద్ రెడ్డి,మాజీ సర్పంచ్ విశాల దాస్ తదితరులుమాట్లాడుతూ ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు చేరవేస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలోమీడియాముఖ్యమైన పాత్ర పోషిస్తోందని అన్నారు.ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తూ, ప్రజల గొంతుకగా నిలవాలని ఆకాంక్షించారు. నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# వైభవంగా దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన



**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రిలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని స్థానిక అసలు వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో 54 ఏళ్లుగా కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ వేడుకను నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో అలరారింది. సింగరేణి మందమర్రి ఏరియా జిఎం ఎన్. రాధాకృష్ణ, ఆయన సతీమణి శ్రీవాణి దంపతుల చేతుల మీదుగా పూజా క్రతువులు శాస్త్రోక్తంగా జరిగాయి. వేద పండితులు అనంతాచార్యులు, నరసింహాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న తిరుమల అమ్మవారి విగ్రహాన్ని భక్తితో విరాళంగా సమర్పించారు. ఐదున్నర దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ ఉత్సవాలు పట్టణ ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్నాయి. విగ్రహ ప్రతిష్ఠాపనతో నవరాత్రి వేడుకలు ప్రారంభం కాగా, పట్టణం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# దండేపల్లి మండల నూతన ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/దండేపల్లి :** దండేపల్లి మండల నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పద్మశాలీ భవనంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి నూతన బాధ్యులను ఎంపిక చేశారు. ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడిగా గోపతి శ్రీనివాస్, అధ్యక్షుడిగా బండి రవిగౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అల్లం కుమారస్వామి యాదవ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బచ్చల సుభాష్, కట్ట వెంకటేశ్, మెంగని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎనగందుల సత్యం, కార్యదర్శులుగా మందల మల్లేష్, ఎడ్ల రాజన్న, కోశాధికారిగా మోదంపురం వెంకటేశ్, అధికార ప్రతినిధిగా షరీఫ్, సంయుక్త కార్యదర్శిగా సద్దాం, ప్రచార కార్యదర్శిగా చుంచు చందు ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా గాలిపెల్లి వెంకటపతి, బూసిరాజు రాజన్న, గడ్డం సత్యన్న వ్యవహరించనున్నారు. కార్యవర్గ సభ్యులుగా శేర్ల చక్రపాణి, జాడి సత్యం, హరీష్ ఎంపికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి, ఐక్యతకు కృషి చేస్తామని నూతన ప్రతినిధులు పేర్కొన్నారు.

# ఆరోగ్యానికి నిత్య వ్యాయామం మేలు : ఎస్ఐ నరేష్




**ప్రజాపక్షం/మందమర్రి :** ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో వ్యాయామం, రన్నింగ్, వాకింగ్‌ను అలవాటు చేసుకోవాలని మందమర్రి ఎస్ఐ గోపతి నరేష్ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎసిసి క్వారీలో జిటిఆర్ ఫౌండేషన్, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఫారెస్ట్ ట్రైల్ రన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని రన్నర్లతో కలిసి ఉత్సాహంగా పరుగులు తీశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి రన్నింగ్ దోహదపడుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలు, మారథాన్‌లపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మందమర్రి రన్నర్స్ అసోసియేషన్ సభ్యుడు గుడికందుల రమేష్ మాట్లాడుతూ.. ప్రకృతి ఒడిలో రన్నింగ్ చేయడం ఆహ్లాదాన్ని ఇస్తుందని, తమ అసోసియేషన్ నుంచి 10 మంది సభ్యులు ఈ పరుగులో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు ముడారపు అనిల్, రామంచ తిరుపతి, మ్యాజిక్ సాయి, శ్రీరాముల వెంకటేష్, డాక్టర్ రవి, గోపికృష్ణ, జక్కుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కాసిపేట భవిష్యత్తు కోసం అఖిలపక్ష పోరాటం



**ప్రజాపక్షం/కాసిపేట :** కాసిపేట మండల భవిష్యత్తు, ప్రధాన రహదారి పరిరక్షణే ధ్యేయంగా అఖిలపక్ష పోరాటానికి శ్రీకారం చుట్టారు. సామాజిక ప్రజా స్పందన వేదిక కన్వీనర్ సిలోజు మురళి ఆధ్వర్యంలో ఆదివారం కాసిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రాథమిక అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, గ్రామస్థులు మాట్లాడుతూ.. మండలానికి ప్రధాన ముఖద్వారమైన సోమగూడెం నుండి దేవాపూర్ వరకు వెళ్లే ప్రధాన రహదారిని తొలగిస్తారనే ప్రచారం జరుగుతుండటంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. ఈ సమస్యపై పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమగ్ర అఖిలపక్ష కమిటీని ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ప్రస్తుతం బతుకమ్మ సంబరాల నేపథ్యంలో పలువురు నాయకులు, సర్పంచులు రాలేకపోవడంతో, ప్రస్తుతానికి 25 మందితో అడ్‌హాక్ కమిటీని ఎంపిక చేశారు. పూర్తిస్థాయి అఖిలపక్ష విస్తృత స్థాయి సమావేశాన్ని ఈ నెల 25వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. నాటి కీలక సమావేశానికి మండలంలోని అన్ని వర్గాల నాయకులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ నూతన కార్యవర్గానికి సన్మానం



**ప్రజాపక్షం/జైనూర్ :** కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే లక్ష్యంతో నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క తెలిపారు. జైనూర్ మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా దుర్వా సింధు, మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా షేక్ రహీం, జిల్లా కార్యదర్శిగా ముబారక్ నియమితులయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు షేక్ రషీద్ ఆధ్వర్యంలో నూతన బాధ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామంటూ సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి అల్లోల



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** దేవి నవరాత్రుల సందర్భంగా నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య,వైస్ చైర్మన్ గణేష్,చక్రవర్తి, కౌన్సిలర్ పెండం శ్రీనివాస్,డిసిసి అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ,మాజీ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి,నిర్మల్ టౌన్ అధ్యక్షులు ఆకుల హరీష్, కౌన్సిలర్ లక్కకుల హరీష్, కోఆప్షన్ మెంబర్ మేడారం ప్రదీప్,ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ కత్తి నరేందర్,ప్యాక్స్ చైర్మన్ రమణ రెడ్డి,పిఏ శ్రీనివాస్,పాకాల రాంచేందర్,మాజీ ఏఎంసీ చైర్మన్ చిలుక రమణ,తదితరులు పాల్గొన్నారు.

# నేడు కొబ్బరి కాయల బహిరంగ వేలం పాట



**ప్రజాపక్షం/దిలావర్ పూర్ :** మండలంలోని సాంగ్వి గ్రామంలోని గంగా పోచమ్మ ( గంగా నీళ్ల జాతర) ఈ నెల 17,18 ను పురస్కరించుకొని జాతర సందర్భంగా కొబ్బరికాయల విక్రయ హక్కుల కోసం బహిరంగ వేలం పాటను నేడు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు,సర్పంచ్,విడీసీ, సభ్యులు తెలిపారు.ఆసక్తి ఉన్న వేలంపాటదారులు ఉదయం 11 గంటలకు నిర్ణీత సమయానికి హాజరై వేలంలో పాల్గొనలని సూచించారు.వేలం పాటలో అత్యధిక మొత్తం పలికిన వారికి కొబ్బరికాయల విక్రయ హక్కులు కేటాయించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

# రాజురలో అమ్మవారికి ఘన స్వాగతం

**ప్రజా పక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని రాజుర గ్రామంలోని దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.గ్రామంలోని మహిళలు భక్తులు నాయకులు,ప్రజాప్రతినిధులు డప్పులతో డోలు సన్నాయిలతో అమ్మవారి శోభయాత్ర ఘనంగా నిర్వహించి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు.అనంతరం భక్తులు తమ తమ మొక్కలను చెల్లించుకున్నారు.ఆయురారోగ్యంగా ఉండాలని సుఖ సంతోషాలతో ఉండాలని పాడిపంటలు బాగా ఉండాలని వ్యాపారాలు అభివృద్ధి చెందాలని దుర్గామాతను వేడుకున్నారు.

# భక్తిశ్రద్ధలతో కనక దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు!





ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని కనకాపూర్ గ్రామంలో శ్రీ కనక దుర్గాదేవి ఆలయం శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి మొదటిరోజు బాలా త్రిపుర సుందరి దేవిగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటోంది. దసరా శరన్నవరాత్రి పర్వదినాలను పురస్కరించుకుని అమ్మవారికి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహిస్తారు తొమ్మిది రోజులు..తొమ్మిది రూపాలు.. అపారమైన భక్తిభావం శరన్నవరాత్రుల సందర్భంగా శ్రీ కనక దుర్గాదేవిని ప్రతిరోజూ ప్రత్యేకంగా అలంకరించి, వివిధ రూపాల్లో పూజించడం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. అమ్మవారి కృపతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తున్నారు.తొమ్మిది రోజులపాటు గ్రామస్తులంతా నియమనిష్ఠలు పాటిస్తూ అమ్మవారిని ఆరాధించనున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటూ తమ భక్తిని చాటుకోనున్నారు. అమ్మవారి దర్శనం, పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కనకాపూర్ గ్రామం భక్తిమయంగా మారనుంది.అమ్మవారి ఆశీస్సులతో గ్రామానికి సుభిక్షం.. ప్రతి ఇంటా ఆనందం శక్తిస్వరూపిణి శ్రీ కనక దుర్గాదేవి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. భక్తి, విశ్వాసం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే శరన్నవరాత్రి ఉత్సవాలు కనకాపూర్ గ్రామంలో ఆధ్యాత్మిక శోభను తీసుకురానున్నాయి.

## ముత్తాపూర్ వేతన కోతలపై విచారణకు ఆదేశాలు?

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : నిర్మల్ రూరల్ మండలం ముత్తాపూర్ గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్ల వేతన చెల్లింపుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. తమకు రావాల్సిన వేతనంలో కొంత మొత్తం తగ్గించి చెల్లించారని కార్మికుడు ఆరోపించగా, విధులకు గైర్హాజరైన రోజులకే కోతలు విధించామని పంచాయతీ కార్యదర్శి వివరణ ఇచ్చారు. ఈ వ్యవహారంపై జిల్లా పంచాయతీ అధికారి విచారణ చేస్తామని స్పందించారు.కార్మికుడి వాంగ్మూలం ప్రకారం.. తమకు నెలకు రూ.9,500 వేతనం రావాల్సి ఉండగా, పనికి హాజరుకాని కొన్ని రోజుల పేరుతో వేతనంలో కోత విధించి చెల్లించారని తెలిపాడు. ఇటీవల వేతనాలు నగదు రూపంలో అందించిన సమయంలో డబ్బులు తగ్గించారని,ఇతర కార్మికులకూ ఇదే విధంగా జరిగిందని ఆరోపించాడు.ఈ ఆరోపణలపై వివరణ కోరగా, కార్మికులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. గైర్హాజరైన రోజులకే వేతన కోతలు విధించామని, తగ్గించిన మొత్తాలను రికార్డుల్లో నమోదు చేసి కార్మికుల సంతకాలు తీసుకున్నామని చెప్పారు.ఈ వ్యవహారంపై విచారణ చేస్తామని జిల్లా పంచాయతీ అధికారి స్పందించిన నేపథ్యంలో సంబంధిత అధికారులు వాస్తవాలను పరిశీలించి స్పష్టత ఇవ్వాల్సి ఉంది. విచారణలో వెల్లడయ్యే అంశాల ఆధారంగానే వేతన కోతలకు సంబంధించిన వాస్తవాలు తేలనున్నాయి.

## మహిళలకు గాజులు తొడిగిన మాజీ డిప్యూటీ స్పీకర్

ప్రజాపక్షం/మెదక్ : దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి మెదక్ పట్టణంలోని ఓ గాజుల దుకాణాన్ని సందర్శించి గాజులు కొనుగోలు చేశారు. దుకాణానికి వచ్చిన మహిళలు, చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించారు. గాజులు కొనిపెట్టి, స్వయంగా తొడిగారు. నవరాత్రుల వేళ మహిళలు సంప్రదాయబద్ధంగా గాజులు ధరించడం ఎంతో ఆనందాన్నిస్తుందని పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. ఇటువంటి వేడుకలు మహిళలు, చిన్నారుల్లో సంతోషాన్ని నింపుతాయని తెలిపారు.

## శైలపుత్రి అలంకారంలో దర్శనమిచ్చిన రేణుక ఎల్లమ్మ

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

### భక్తులతో సందడిగా మారిన దేవాలయాలు



ప్రజా పక్షం/దిలావర్‌పూర్ : మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి.శరన్నవరాత్రులను పురస్కరించుకొని గ్రామంలోని పలు దేవాలయాల వద్ద మండపాలు ఏర్పాటు చేసి దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు.తొలిరోజు కలశ స్థాపనతో ఉత్సవాలకు అంకురార్పణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వడంతో ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.దుర్గాదేవి తొమ్మిది రూపాల్లో మొదటి రూపమైన శైలపుత్రి దేవిని పర్వతరాజు హిమవంతుని కుమార్తెగా పురాణాలు వర్ణిస్తాయి. వృషభ వాహనంపై ఆశీనురాలై, ఒక చేతిలో త్రిశూలం, మరో చేతిలో కమలాన్ని ధరించి, శిరస్సుపై చంద్రవంకతో విరాజిల్లే శైలపుత్రి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. తొలిరోజు అమ్మవారికి కట్టె పొంగలిని నైవేద్యంగా సమర్పించి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు.శరన్నవరాత్రుల సందర్భంగా గ్రామంలోని యువత దుర్గాదేవి మాలలు ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ అలంకారాల్లో పూజిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. అమ్మవారిని నిష్ఠతో ఆరాధిస్తే సుఖసంతోషాలు కలిగి,మనోవాంఛలు నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు.నవరాత్రి ఉత్సవాల ప్రారంభంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## కరెంటు కోతలతో అన్నదాతల గోస

### రోజుకు మూడు గంటలే సరఫరా

### ఎండిపోతున్న పంటలు.. రైతుల ఆవేదన

ప్రజాపక్షం / కౌటాల : వ్యవసాయానికి అరకొర విద్యుత్ సరఫరాతో రైతాంగం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటోంది. కౌటాల మండల పరిధిలోని తాటిపల్లి, మొగడ్ దగడ్, గుండాయిపేట సహా పలు గ్రామాల్లో వ్యవసాయానికి రోజుకు కేవలం మూడు నుంచి నాలుగు గంటలే విద్యుత్ ఇస్తుండటంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. పంటలు చేతికొచ్చే కీలక సమయంలో కరెంటు కోతలు తీవ్రం కావడంతో బోరుబావుల కింద సాగు చేస్తున్న పైర్లు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ఇప్పటికే వేల రూపాయల పెట్టుబడులు పెట్టిన రైతులు, విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియక దిక్కుతోచని స్థితిలో పడ్డారు. రాత్రి వేళల్లో ఇచ్చే కొద్దిపాటి సరఫరాతో పొలాల వద్దకు వెళ్లి మోటార్లు వేయడం, నీటి పారుదల చూసుకోవడం రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది.

### పెట్టుబడులు మునిగే ప్రమాదం ఉంది

రోజుకు మూడు నాలుగు గంటల కరెంటుతో విస్తారంగా ఉన్న పొలాలకు నీరు పారించడం ఏమాత్రం సాధ్యం కావడం లేదు. ఇప్పటికే దుక్కులు దున్నడం, విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చుల కోసం ఎకరాకు వేల రూపాయల పెట్టుబడి పెట్టాం. పంటలు చేతికొచ్చే కీలక దశలో తడులు అందక పైర్లు కళ్లముందే ఎండిపోతున్నాయి. సరైన సమయానికి విద్యుత్ అందించకపోతే పెట్టిన పెట్టుబడులు పూర్తిగా మునిగిపోయి తీవ్ర అప్పులపాలవుతాం.

దినకర్ చందన్షేడే రైతు(తాటిపల్లి)

### రాత్రి వేళల్లో ప్రాణభయం వెంటాడుతోంది

అధికారులు పగటి పూట కోతలు విధించి అర్ధరాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా చేస్తుండటంతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. చీకట్లో పాములు, తేళ్ల వంటి విషపురుగుల భయంతో పొలాల వద్దకు వెళ్లలేకపోతున్నాం. నీటి పారుదల చూసుకోవడానికి రాత్రంతా జాగరణ చేయాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులను గుర్తించి పగటి వేళల్లోనే విద్యుత్ అందించాలి.

### సరఫరా వేళలు ఖరారు చేయాలి

విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో స్పష్టత లేకపోవడంతో వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా చేసుకోలేకపోతున్నాం. సరఫరా సమయాలపై రైతులకు ముందస్తు సమాచారం అందించాలి. లోవోల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి సాంకేతిక లోపాలను సరిదిద్దాలి. ప్రభుత్వం స్పందించి వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి.



## కార్పొరేట్లకు కేంద్రం ప్రోత్సాహం – సిసిఎం

ప్రజాపక్షం/పాలకుర్తి: కేంద్రప్రభుత్వం కార్పోరేట్ శక్తులను ప్రోత్సహిస్తూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తోందని సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య విమర్శించారు. దర్దేపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వెంకన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశంలో మతతత్వం, కులతత్వం పెరుగుతున్నాయని, మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, మహిళలపై అఘాయిత్యాలు అధికమవుతున్నాయని ఆరోపించారు. వెంకన్న రైతు సంఘంలో చురుకుగా పనిచేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సోమసత్యం, మదార్, ఇంద్రారెడ్డి, సంపత్, అశోక్‌బాబు, కొమురయ్య, రాజు, సాంబాజీ, కొమురయ్య, కుమారస్వామి, ఉప సర్పంచ్ సోమయ్య, నర్సయ్య, మధు, రామచంద్రం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా దశాబ్ది ఉత్సవాలు



ప్రజాపక్షం/జనగామ టౌన్: జనగామ జిల్లా దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం జనగామ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో విజయ ఫంక్షన్ హాల్ లో వేడుకలను నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రా జు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుమారు 70 మంది జిల్లా ఉద్యమకారులను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సాధన ఉద్యమ జ్ఞాపకాలను గు ర్తు చేసుకున్నారు. ఉద్యమకారులపై నమోదైన కేసులను ప్ర భుత్వం ఎత్తివేయాలని మంగళంపల్లి రాజు కోరారు. జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని అతిథులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

## శ్రీరాములపల్లి పద్మశాలి అధ్యక్షుడిగా తాటిపాముల రాములు

ప్రజాపక్షం/కమలాపూర్: కమలాపూర్ మండలం శ్రీరాములపల్లి గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షులుగా తాటిపాముల రాములు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా తాటిపాముల రాములు మాట్లాడుతూ... పద్మశాలీల ఐక్యత కోసం, అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడతానని, పద్మశాలీలకు, చేనేత కార్మికులకు ఏ ఆపద వచ్చిన ముందుంటానని తెలిపారు. తాటిపాముల రాములుతో పాటు డైరెక్టర్ గా తాటిపాముల తిరుపతి, వలస సాంబయ్య, మార్త రవీందర్, పెగడ శ్రీకాంత్, వెంగళ రాజు ఎన్నికైనారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడికి, కార్యవర్గానికి కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, జిల్లా అధ్యక్షులు ఆనందం, మండల అధ్యక్షులు బొప్ప శివ శంకర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి పులికంటి రాజేందర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## జనగామలో బిసి మేధావుల సమ్మేళనం



ప్రజాపక్షం/జనగామ: జనగామ జిల్లా కేంద్రంలో ఆదివారం బిసి మేధావుల సమ్మేళనం జరిగింది. సూర్యాపేట రోడ్డులోని కెమిష్ట్రి భవన్‌లో ఈ కార్యక్రమం జరగగా రాష్ట్ర బిసి ఇంటలెక్చువల్ అధ్యక్షులు టి చిరంజీవులు, బిసి కమీషనర్ సభ్యురాలు బాలలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిలు రాజకీయాధికారంలో కోసం పనిచేయాలన్నారు. బిసిలకు రావాల్సిన వాట కోసం కొట్లాడాలని, ప్రభుత్వం ఏవైనప్పటికీ బిసిలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కన్నా పరశురాములతో పాటు ఆర్‌టిఐ సభ్యులు అభిగౌడ్, అడ్వకేట్ జమాల్ షరీఫ్, అనిల్‌కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు బిసి నాయకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఉషాదయాకర్



ప్రజాపక్షం/-రాయపర్తి:- మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన మార్క్‌కేర్ హాస్పటల్ డైరెక్టర్, ఎంజిఎం మాజీ ఆర్ఎం కుందూరు వెంకటరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి దశ దినక ర్మలో ఆదివారం ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్ రావు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## ఆడబిడ్డకు ఆరాధన కాదు.. సమానత్వమే అసలైన గౌరవం!

ప్రజాపక్షం/నెక్కొండ: ఆడబిడ్డలో ఆదిశక్తిని చూస్తూ, సరస్వతీ దేవితో పోలుస్తూ పూజించే సమాజం...అదే ఆడపిల్లకు అన్ని రంగాల్లోద సమాన అవకాశాలు కల్పించడంలో విఫల్ చూపడం ఎంతవరకు సమంజసమని తెలంగాణ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు, మాజీ ఎంపిపి గటిక అజయ్‌కుమార్ ప్రశ్నించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఆడబిడ్డలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆడపిల్లలకు సమాన హక్కులు, అవకాశాలు, గౌరవం కల్పించినప్పుడే నిజమైన సమానత్వ సమాజం ఆవిర్భవిస్తుందని పేర్కొన్నారు. ఆడబిడ్డల ఆశయాలకు అడ్డంకులు సృష్టించకుండా, వారి కలలకు రెక్కలొచ్చి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఆడపిల్లలకు గౌరవించడం మాటల్లోనే కాకుండా చేతల్లోనూ చూపాలని, వివక్షకు తావులేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అజయ్‌కుమార్ ఆకాంక్షించారు.

## అంతర్జాతీయ బాలికల దినోత్సవం




ప్రజాపక్షం/నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని స్వయంకృషి సంస్థ కార్యాలయం లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం అక్టోబర్ 11 సందర్భంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్ బాలికలు ఉద్దేశించి మాట్లాడుతూ సృష్టి కి కారణం అయిన ఆడపిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుందామని, వారికి బంగారు భవిష్యత్‌ను అందించడానికి అందరం కృషి చేద్దాం అని పిలుపునిచ్చారు. బాలికలకు తప్పనిసరి సెకండరీ విద్యను అందించి వారు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడానికి చేయూత నుఅటందించాలని కోరారు. అను నిత్యం సమాజంలో ఆడపిల్లలు వివక్షను ఎదుర్కొంటూ ఎక్కడో ఒక చోట లైంగిక వేధింపులకు గురి కావడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలు ధైర్యంగా సమస్యలను ఎదిరించే స్థాయికి ఎదగాలని, మానసిక స్థైర్యాన్ని కలిగి ఉండాలన్నారు. బాలల చట్టాలు పైన అవగాహన కలిగి ఎప్పుడైనా ఎక్కడైనా ఆడపిల్లలకు సమస్యలు ఎదురైతే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ 100టోల్ ఫ్రీ నెంబర్ కి సమాచారం అందించి రక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమం లో బాలికలు గిరగాని నివ్య, కృష్ణ, విశ్రుత, ధ్రువ, శన్విత పాల్గొన్నారు.

## కలెక్టర్ బ్రీడింగ్ చెక్కర్స్‌ను ఆదుకోవాలి

బ్రీడింగ్ చెక్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు భూక్య శ్రీనివాస్ నాయక్



ప్రజాపక్షం/చెన్నారావుపేట: జిల్లా కలెక్టర్ బ్రీడింగ్ చెక్కర్స్ ను విధుల్లోకి తీసుకొని తమ కుటుంబాలను ఆదుకోవాలని బ్రీడింగ్ చెక్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు భూక్య శ్రీనివాస్ నాయక్, ఉపాధ్యక్షులు చిన్నపెల్లి దేవేందర్ లు కోరారు. ఆదివారం చెన్నారావుపేట మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్ జిల్లాలోని గ్రామాలలో బ్రీడింగ్ చెక్కర్స్ గా పనిచేయడానికి విధుల్లోకి తీసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజారెడ్డికి ఆదేశాలు జారీ చేశారన్నారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజారెడ్డిని సెప్టెంబర్ 30వ తేదీన మర్యాదపూర్వకంగా కలిసి తమను విధుల్లోకి తీసుకోవాలని కలవగా తమ నుండి దరఖాస్తులను కూడా స్వీకరించినట్లు తెలిపారు. కానీ ఇప్పటివరకు విధుల్లోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తమను విధుల్లోకి తీసుకునే విధంగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రీడింగ్ చెక్కర్స్ ముత్యం రాజు, శేఖర్, రామ్ చందర్, భద్రయ్య, సూర్య, రవి, బాబు, రామ్ కుమార్, సిహెచ్ రాజు, దేవేందర్, రాజేశ్వరరావు, చాణిక్య, సరిత, సల్లా పుద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలి



ప్రజాపక్షం/నర్సంపేట: పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని బిఆర్ఎస్ పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మోటూరి రవి అన్నారు. నర్సంపేట మండలంలోని గురిజాల గ్రామంలో బిఆర్ఎస్ గ్రామ కమిటీ నాయకులు నీళ్ల లేక ఎండిపోతున్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ మోటూరి రవి మాట్లాడుతూ గురిజాలలో చాలామంది రైతులు వరి, ఇతర పంటలు సాగు చేశారని నీళ్ల లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి అధికారుల ద్వారా సర్వే చేయించి ఎకరాకు యాబై నష్టపరిహారం రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో అధిక వర్షాలు పడి రైతులు నష్టపోతే స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సహకారంతో ఆరోజు రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు గద్దం కొమురయ్య, బండారి రమేష్, మాజీ రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ అన్న రాజమల్లు, అల్లి రవి, మాజీ ఉప సర్పంచ్ మంచిక హరీష్, వార్డు సభ్యుడు గజ్జి రాము, గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు మంచిక దేవేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పత్తి కుమారస్వామి, యూత్ మండల ప్రధాన కార్యదర్శి సంగం శ్రీకాంత్, సీనియర్ నాయకులు మర్ద నవీన్, నీలం కృష్ణమూర్తి, చిర్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



ప్రజాపక్షం/వరంగల్: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కుటుంబ సమేతంగా ఆదివారం వరంగల్‌లోని శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కుటుంబ సమేతంగా విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలు చేపట్టి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భద్రకాళి అమ్మవారి ఆలయం భక్తులతో సందడిగా మారింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా ఆలయ పరిపాలన విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రకాళి ఆలయంలో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతున్నాయని వారు పేర్కొన్నారు.

## హక్కుల సాధనకు బిసిలంతా ఏకం కావాలి



బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి

ప్రజాపక్షం/నర్సంపేట: అన్ని రంగాల్లో బిసిలను వెనక్కి నెట్టేస్తున్నా, ఆర్థిక రాజకీయ సామాజిక న్యాయాన్ని అందకుండా చేస్తున్నా బిసిలు కులాలుగా, రాజకీయంగా చీల్చబడి ఉండటం వల్లనే బిసిలకు విద్య ఉద్యోగ చట్టసభల్లో బడ్జెట్లో ద్రోహం జరుగుతుందని బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా రెండవ మహాసభలు అక్టోబర్ 16న వరంగల్ శివనగర్ ఉర్సు జంక్షన్ లో ఉన్న రాజశ్రీ గార్డెన్ లో జరగనున్న సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కపెల్లి రమేష్, సివిల్ సప్లై హమాలి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్, బిసి హక్కుల సాధన సమితి జిల్లా ఉపాధ్యక్షులు ఇల్లందుల సాంబయ్యతో కలిసి నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా లెక్కలతో పాటు బిసి కులాల లెక్కలు తీసి ఒక్కో కులానికి ఒక్కో యూనిక్ నెంబర్ ఇవ్వాలన్నారు. బిసి జనాభా లెక్కల ప్రకారం సకల రంగాలలో బిసిల వాటా బిసిలకు చెందే విధంగా కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచడం కోసం కార్యాచరణ ప్రణాళిక ఈ మహాసభలో రూపొందించుకొని జిల్లాలో బిసిలను రాజకీయాలకతీతంగా సమీకరించడానికే ఈ మహాసభలు జరుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి మండల నాయకులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల భవనాలకు రూ.45లక్షల నిధులు మంజూరు

ఖానాపురం మండలంలోని ఆరు గ్రామాలకు నిధుల కేటాయింపు

ప్రజాపక్షం/ఖానాపురం: ఖానాపురం మండలంలోని ఆరు గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి ఎంఎల్‌సి దొంతి మాధవరెడ్డి రూ.45లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఏఎంసి వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, పిఏసిఎస్ చైర్మన్ వల్లే శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బతుకమ్మ పండగ సందర్భంగా మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ మహిళా సంఘాల తరుపున ఎంఎల్‌ఏకు కృతజ్ఞతలు తెలిపారు. నిధుల వివరాల ప్రకారం అశోక్‌నగర్‌కు రూ.10లక్షలు, ఖానాపురానికి రూ.7లక్షలు, మంగళవారిపేటకు రూ.8లక్షలు, కొత్తూరుకు రూ.5లక్షలు, బుధరావుపేటకు రూ.5లక్షలు, ధర్మారావుపేటకు రూ.10లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ భవనాలు మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాలు, ఆర్థిక కార్యకలాపాలు, శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడతాయని వారు తెలిపారు.

## నెక్కొండ ఎస్ఐగా జలగం శ్రవణ్ కుమార్



ప్రజాపక్షం/నెక్కొండ: నెక్కొండ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా జలగం శ్రవణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. జిల్లా సిపి శ్వేతా ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం మిల్స్ కాలనీ ఎస్ఐగా పనిచేస్తున్న ఆయన సోమవారం నుండి నెక్కొండ ఎస్ఐగా విధులు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. గతంలో నెక్కొండలో ప్రొబెషనరీ ఎస్సైగా పనిచేసిన శ్రవణ్ కుమార్‌కు మండల ప్రజలో ఇప్పటికే పరిచయం ఉంది. ఆయన నియామకంపై అధికారిక స్పష్టత వచ్చేసింది. గతంలోని నెక్కొండ ఎస్సైగా పనిచేసిన మహేందర్ ఎస్ఐ కొన్ని కారణాల వలన సస్పెండ అయిన విషయం విధితమే, ప్రస్తుతం ఆయన దుగ్గొండి ఎస్ఐగా మహేందర్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

## మృతుల కుటుంబాలకు శ్రీనివాస్ రెడ్డి పరామర్శ



ప్రజాపక్షం/రాయపర్తి: మండలంలోని మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పెండ్లి మల్లారెడ్డి, పెండ్లి కొమురరెడ్డి తల్లి పెండ్లి వెంకటనర్సమ్మ, కొలనుపల్లి గ్రామానికి చెందిన గాజుల దివ్య ఇటీవల మరణించగా ఆదివారం మృతుల కుటుంబాలను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత, టిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం గాజుల దివ్య కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, నూనె క్యాన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోష్‌గౌడ్, చందు రామ్, చందు లక్ష్మణ్, రవీందర్, గాదె రవీందర్ రెడ్డి, లక్కం కుమార్, గూడ రాజిరెడ్డి, సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## దళిత బంధు పథకం నిధుల విడుదల కోసం వొడితల ప్రణవ్ ప్రయత్నం



ప్రజాపక్షం/కమలాపూర్: రాష్ట్ర ఎస్సి, ఎస్టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంఛార్జీ వొడితల ప్రణవ్ హైదరాబాద్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దళిత బంధు పథకం సంబంధించి నిధుల విడుదల, నియోజకవర్గంలో దళితుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.